# సదసత్సంశయం

శ్రీ శ్రీ

ఆలోలము లాలోచన
లేవేవో నాలోపల
ప్రాలేయచ్ఛాయలవలె
తారాడగ కోరాడగ

పేరుపేరు వరుసలతో
పిలిచి ప్రశ్న వేస్తున్నా
ఈ తెగని సమస్యను భే
దించువారలెవరో అని

ఎన్నో సందేహాలూ
ఎన్నో సంపాతాలూ
జీవితంపు చిక్కుముడులు
విడ వెంతగ సడలించిన

ఈ సృష్టికి ఏమర్థం
మానవునికి గమ్యమేది
ఒక సకలాతీత శక్తి
ఉన్నట్టా లేనట్టా

2

నిరంతరం ఘోషించే
నీరనిధిని పిలిచినాను
అస్తి నాస్తి రూపమైన
ఆకాశము నడిగినాను

మహాకవుల గ్రంథాలను
మనసుపెట్టి పఠించాను
ప్రవ్రజితుల ముముక్షువుల
భావాలను స్మరించాను

యుగయుగాలు తరలెగాని
ప్రశ్న ప్రశ్నలాగున్నది
అలలు కదిసి మరలి చనగ
శిలమాత్రం మిగిలినట్టు

జగదీశ్వరు డతడెవరో
అగపడితే బాగుండును
ఏమీ యిది స్వామీ అని
నిలవేస్తా కడిగేస్తా

3

కవిహృదయపు కనుమలలో
గర్జించిన పర్జన్యం
పెనుచీకటి తిరుగుబాటు
బీభత్సపు మెరుపుదాడి

కనులముందు చిత్రించే
గతిలేని జనాల బాధ
కడుపు తరుక్కుని పోయే
కన్నీళ్ళ విషాదగాథ

కరువులలో వరదలలో
కటికదరిద్రుల అవస్థ
కవితలోన కథలలోన
కట్టాలని తలచినపుడు

ఈ విశాల జగతినుంచి
ఏమిటి నే కోరినాను
ఒక జానెడు సానుభూతి
ఒక దోసెడు తీరుబాటు

(సశేషం)